
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 జూన్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు




విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రభుత్వం పెంచిన కరెంటు బిల్లులు తక్షణమే తగ్గించే దిశగా ప్రయత్నం చేయాలని, ప్రభుత్వ దృష్టికి ప్రజా సమస్యను తీసుకెళ్లి ఛార్జీల భారం నుంచి ఉపశమనం కలిగించాలంటూ వామపక్ష నాయకులు నగర శాసనసభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వామపక్ష నాయకులు నగర శాసనసభ్యుల క్యాంపు కార్యాలయానికి చేరుకొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక భారాన్ని వివరించారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు జీవించడం కష్టంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంలో మునిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఉందన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఊరట కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సయ్యద్ సిరాజ్, లక్ష్మీ రెడ్డి,షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

పేద,మధ్య తరగతికి విద్యుత్ సెగలు..!

కుటుంబాలకు పెను భారం - లబోదిబోమంటున్న ప్రజలు

ప్రజాశక్తి-ప్రజాశక్తి ప్రతినిధి నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా విద్యుత్ వినియోగదారులపై ఛార్జీలతో బాదేసింది. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 8.5 లక్షల మంది గృహ వినియోగదారులు, 96 వేల వ్యవసాయ కనెక్షన్లు, 25 వేల వరకూ కమర్షియల్ వినియోగదారులు ఉన్నారు. వివిధ రకాల ఛార్జీల పేరుతో జనం నెత్తిన కరెంట్ బిల్లులు వేస్తున్నారు. సాధారణ రోజుల్లో పేద, మధ్యతరగతి వినియోగదారులకు ఒక కుటుంబానికి కేవలం రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు బిల్లులు వచ్చేవి. ఉద్యోగులు, వ్యాపారులకు కమర్షియల్ వినియోగదారులకు కాస్త ఎక్కువ వచ్చింది. మే ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగాయి. వడగాల్పులు రావడంతో జనం తట్టుకోలేకపోయారు. గ్రామాల్లో సైతం ఇళ్లలో ఫ్యాన్లు, ఎప్పుడూ తిరిగే పరిస్థితులు వచ్చాయి. గతంలో చెట్ల కింద ఉండే జనం ఇళ్లు వదిలి బయటకు రాలేదు. పట్టణ ప్రాంతాల్లో సాధారణ, మధ్యతరగతి ప్రజలు సైతం ఎండలకు భయపడి ఏసిలు కొనుగోలు చేశారు. రాత్రి, పగలు సెగలు ఉండటంతో ఏసిలు వాడకం ఎక్కువైంది. విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో కొన్ని ప్రాంతాల్లో కరెంట్ వైర్లు కట్ కావడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం జరిగింది. ఇటీవల కాలంలో నెల్లూరు నగరంతోపాటు జిల్లా వ్యాపితంగా ఇందుకూరుపేట, వరికుంటపాడు, మర్రిపాడు, దుత్తలూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతోంది. నెల్లూరు నగరం అపోలో ఆస్పత్రి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ఇటీవల పడారుపల్లి, సుందరయ్య కాలనీ, భక్తవత్సల నగర్ ప్రాంతాల్లో తరచూ ఇబ్బందులు వస్తున్నాయి. గత నెల 30వ తేదీ రాత్రి 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 1వ తేదీ ఉదయం 7గంటలకు ఇచ్చారు. . ఈ ప్రాంతంలో ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. ఇదే ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మూడు, నాలుగు గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇలా అనేక ప్రాంతాల్లో జరుగుతోంది. లోడ్ ఎక్కువ కావడంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. మేలో బిల్లులు జూన్1 నుంచి వినియోగదారులు అందజేస్తున్నారు. విద్యుత్ బిల్లులు చూస్తున్న జనం గగ్గోలు పెడుతున్నారు. వేలకు వేలు బిల్లులు చేతుల్లో పెడుతున్నారు.

భారీగా బిల్లుల బాదుడు..

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారీగా ఛార్జీలు మోపుతోంది. ఏప్రిల్‌లో భక్తవత్సలనగర్ ప్రాంతంలో ఓ ఆటో కార్మికుని మార్చి బిల్లు రూ.377 వచ్చింది. మేలో రూ.3,357 బిల్లు చేతిలో పెట్టారు. మరో ప్రాంతంలో ఏప్రిల్‌లో రూ.2,500 బిల్లు రాక, మే బిల్లు రూ.5157 బిల్లు వచ్చింది. ఇది చిన్న చిన్న పనులు చేసుకుని జీవించేవారని, ఇటీవల కాలంలో ఎండలతో ఏసిలు వినియోగిస్తుండటంతో అధిక బిల్లులు వచ్చాయి. విద్యుత్ రంగ సంస్థ సాధారణ బిల్లులకు అదనంగా భారీగా ఛార్జీలు పెంచింది. ఒక సాధారణ వ్యక్తులకు ఇలా బిల్లులు వచ్చాయి. బిల్లు యూనిట్ 613 సరాసరి యూనిట్ 352, వినియోగపు కనీస ఛార్జీలు రూ. 4625, స్థిర ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీలు రూ.55, విద్యుత్ సుంకం రూ.36, ఎఫ్‌పిపిసిఎ (2022-23) రూ.115, 2023-24 నెలకు 200, 25, ట్రూ ఆఫ్ ఛార్జీ రూ.93, మొత్తం రూ. 5,160 బిల్లులు గతంలో సర్దుబాటు ఛార్జీల పేరుతో జనంపై పడేవారు. ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారు. ఏదో రకంగా భారీగా ఛార్జీలు పెంచి జనం చేతిలో బిల్లులు పెట్టారు. వీటిని చూసిన జనం గగ్గోలు పెడుతున్నారు. ఓ వైపు ఎండలతో ఇబ్బందులు పడుతున్న వారికి విద్యుత్ ఛార్జీలు మరింత సెగలు పుట్టించారు. వరికుంటపాడు మండలం, తాగుడుపల్లి గ్రామంలోని నిరుపేదలకు కరెంట్‌సెగలు తగిలాయి. రోజు వారీ కూలీకి వెళ్లే వారికి గతంలో రూ.200 కరెంట్ బిల్లు వస్తుండగా, ప్రస్తుతం రూ. 400 చేతిలో పెట్టారు. వేసవి కావడంతో కరెంట్ వాడుకున్నామని భావించిన ప్రజలకు అందులో ఉన్న అనేక రకాల ఛార్జీలతో లబోదిబో అంటున్నారు. ప్రభుత్వం బిల్లులు తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఛార్జీల పేరుతో బాదేశారు..

నక్కల నాగేశ్వరరావు
వరికుంటపాడు, తాగుడుపల్లి



మేం రోజు కూలీలం. ప్రస్తుతం ఎండా కాలం పనులు లేవు. ఇలా ంటి సమయంలో కరెంట్ బిల్లులు ఇబ్బంది పెడుతున్నాయి. మాకు గతంలో రూ.200 వచ్చేది. ఇప్పుడు రూ.400 చేతిలోపెడుతున్నారు. మేం కరెంట్ వాడుకున్నాం అనుకున్నాం, తీరా చూస్తే ఎప్పుడెప్పుడో సర్దుబాటు ఛార్జీల పేరుతో బాదేశారు. ప్రభుత్వం పేదల గురించి ఆలోచించాలి.

ఛార్జీలు చూస్తే భయమేస్తోంది..

డి.నాగేంద్ర వరికుంటపాడు



ప్రభుత్వం మాకేదో చేస్తున్నామని చెబుతుంది. కరెంట్‌ఛార్జీలు చూస్తే భయమేస్తుంది. ఒక్క నెల కాదు,ప్రతినెలా దీనిని కట్టాల్సి వస్తుంది. మాకు గతంలో రూ.500 బిల్లు వచ్చేది. ఈనెలలో రూ.700 వచ్చింది. మేం గతం కంటే ఎక్కువ ఏమీ వాడలేదు. మాకేమి ప్రభుత్వ పథకాలు రావడం లేదు. కరెంట్ బిల్లులు మాత్రం భారీగా పెరిగిపోతున్నాయి.

'కోటంరెడ్డి'కి టిడిపి బాధ్యతలు..!

నెల్లూరు జిల్లా టిడిపిలో మంగళవారం ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వైసిపికి దూరమైన నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టిడిపిలో చేరారు. టిడిపి సీనియర్ నేతలంతా కలిసి భేటీ అయ్యారు. నెల్లూరు టిడిపి బాధ్యతలను కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అప్పగించారు. నిన్నటి వరకు ఉప్పు,నిప్పుగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, కలిశారు. టిడిపి అధికారంలోకి రావడానికి కలిసి పనిచేస్తామని నేతలంతా కలిసి ప్రకటించారు. టిడిపి కార్యాలయంలో అందరు నేతలు కలిసి లోకేష్ యువగళం విజయవంతం చేయాలని నిర్ణయించారు.

- చేతులు కలిపిన శ్రీధర్‌రెడ్డి, అజీజ్
- రూరల్‌లో నాటకీయ పరిణామాలు
- టిడిపి గెలుపునకు కృషి చేస్తా- కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు టిడిపి రాజకీయాలు కొలిక్కి వస్తున్నాయి. వైసిపి నుంచి బహిష్కరణకు గురైన ముగ్గురు ఎంఎల్ఎలు టిడిపిలో అనధికారంగా చేరారు. ఇప్పటికే వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు చంద్రబాబునాయుడు, లోకేష్ బాబును కలిసి టిడిపికి మద్దతు ప్రకటించారు. లోకేష్ పాద యాత్రలో పాల్గొన్నారు. టిడిపిలో చేరుతున్నామని ప్రకటించారు. తాజాగా మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టిడిపిలో నెలకొన్న పరిస్థితులు సర్దుబాటు చేశారు. మాగుంట లేవుట్‌లోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నివాసంలో టిడిపి సీనియర్ నేతలు, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌తో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి భేటీ అయ్యారు. లోకేష్ పాదయాత్ర నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో విజయవంతం చేస్తామని ప్రకటించారు.పార్టీ పెద్దలు కోటంరెడ్డి సోదరులకు నెల్లూరు టిడిపి బాధ్యతలు అప్పగించారు. నేటి నుంచి కోటంరెడ్డి సోదరులు టిడిపిలో కొన సాగుతారని ప్రకటించారు. లోకేష్‌పాదయాత్రను విజయవంతం చేస్తామని, టిడిపిలో కొన సాగుతామని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడానికి తమ వంతు పనిచేస్తామన్నారు. అబ్దుల్ అజీత్ మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి పార్టీలోకి రావడానికి తమకు ఆనందంగా ఉందని, ప్రజల్లోనూ, నాయకుల్లోనూ మార్పు మొదలైందని తెలిపారు. నిన్నటి వరకు ఉప్పు, నిప్పులా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు టిడిపిలో కలిసి పనిచేస్తామని ప్రకటించారు.


టిడిపి కార్యాలయంలో నేతలతో ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

టిడిపి ఆఫీసులో 'కోటంరెడ్డి'

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో అడుగుపెట్టారు. టిడిపి నేతలు ఆయనకు సాధరణ స్వాగతం పలికారు. ఇప్పటికే వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి చంద్రబాబునాయుడును కలిసి, లోకేష్ పాదయాత్ర విజయవంతం చేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తొలిసారి టిడిపి కార్యాలయానికి వెళ్లారు. తాను టిడిపిలో పనిచేస్తానని, రూరల్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలను సొంత మనుషులుగా చూస్తానని, నెలరోజుల్లో మార్పు చూస్తారన్నారు. లోకేష్ పాదయాత్ర ఘన విజయం చేస్తామన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, అబ్దుల్ అజీజ్, బి.రమేష్‌రెడ్డి, జన్నార్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇక నుంచి తాము టిడిపిలో కొనసాగుతామని ప్రకటించారు. ఇది అనధికార చేరికైనప్పటికీ చంద్రబాబు సమక్షంలో ముగ్గురు ఎం ఎల్ఎలు అధికారికంగా టిడిపిలో చేరనున్నారు. నెల్లూరు రూరల్ టిడిపిలో ఉన్న సమస్య సమసిపోవడంతో సీనియర్ నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

చంద్రబాబుతో 'కావ్య' భేటి..!

కావలి టికెట్‌పై ఉత్కంఠ


చంద్రబాబునాయుడును కలిసి కావ్య కృష్ణారెడ్డి

పజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కావలి ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, వ్యాపారవేత్త మాజీ జలదంకి ఎంపిపి కావ్య కృష్ణారెడ్డి టిడిపి నేత చంద్రబాబు నాయుడును కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో భేటి జరిగింది. కొంత కాలంగా కృష్ణారెడ్డి కావలి టిడిపి టికెట్ ఆశిస్తున్నారు. పార్టీకి ఫండ్ ఇవ్వడంతోపాటు, ఎన్నికల్లో ఖర్చుచేసుకుంటానని, టిడిపినేతలకు చెప్పినట్లు తెలిసింది. ఇటీవల రాజమండ్రిలో జరిగిన టిడిపి మహానాడుకు కావ్య కృష్ణారెడ్డి రూ.కోటి విరాళమిచ్చారు. ఆయన వైసిపిలో ఉన్నారు. టిడిపి టికెట్ తనకు ఇవ్వాలని పార్టీనేతలతో టచ్‌లో ఉన్నారు. అక్కడున్న రాజకీయ పరిమాణాల నేపథ్యంలో హామీ ఇవ్వలేదని తెలిసింది. జనసేన, బిజెపితో పొత్తు ఉంటే పరిస్థితులు మారే అవకాశముంది. టిడిపి నేతలతో టచ్‌లో ఉండడంతో ఇటీవల ప్రభుత్వం రూ.143 కోట్లు అక్రమ మైనింగ్ పేరుతో పెనాల్టీ విధించింది. చంద్రబాబుతో కావ్య భేటి కావడంతో కావలి నియోజకవర్గంలో ఆసక్తి నెలకొంది. రాజకీ యాల్లో ఎప్పుడు ఏమైనా జరిగే అవకాశాలున్నాయి. ఏం జరుగు తుందో చూడాలి.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి -కందుకూరు : మండలంలోని మహాదేవపురం, కొండ కందుకూరు గ్రామాల్లో రైతులకు 50 శాతం రాయితీతో పచ్చిరొట్టె విత్తనాలు మంగవారం పంపిణీ చేశారు. మండలానికి జనుములు 141 క్వింటాళ్లు, పిల్లిపేసర 20 క్వింటాళుమంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి వి రాము తెలిపారు. కావాల్సిన వారు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు యస్‌కె నజీర్,కె చంద్రిక, కొండి కందుకూరు గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొడపాటి వెంకటేశ్వర్లు త రైతులు పాల్గొన్నారు.

సుధాకర్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-గుడ్లూరు :గుడ్లూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘం కార్యకర్త ఇన్నమూరి సుధాకర్‌పై మల్లికార్జున రెడ్డి దాడి చేసి గాయపరచడం అమానుష చర్య అని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ విమర్శించారు. గుడ్లూరు మండలానికి చెందిన ఆర్యవైశ్యుల సంఘం కార్యకర్తల సమావేశంలో మంగళవారం ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అమ్మ ఒడి పథకం కోసం వివరాలు అడిగినందుకు ఆగ్రహించిన మహిళా వాలంటీర్ తండ్రి మల్లికార్జున రెడ్డి దౌర్జన్యంగా ఇంట్లోకి వెళ్లి బాధితున్ని బయటకు లాగి చెప్పుతో కొట్టి గాయపరచడం దారుణంగా ఉందని ప్రసాద్ అన్నారు. ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు.దీనిపై కేసు నమోదైంది.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు :జిల్లా ఉప రవాణా కమిషనరు బి. చందర్ ఆదేశాల మేరకు కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్ కె. ఎమ్‌డి రఫీ ఆధ్వర్యంలో పట్టణంలోని బి.ఆర్ ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంవిఐ ఎస్‌కె ఎమ్‌డి రఫీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రహదారి భద్రత పై అవగాహనా సదస్సులో భాగంగా కావలి ప్రాంతీయ రవాణా శాఖాధికారి వై సుధాకర రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. భాగంగా కళాశాల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు , కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-కందుకూరు : హర్ దిల్ మే వైఎస్ఆర్ హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమంలో భాగంగా మగళవారం కందుకూరు పట్టణంలోని ఏకలవ్య నగర్ అజీమున్నీసా మసీదులో లిహర్ దిల్ మే వైయస్సార్ హం సబ్ జగన్ కె సాత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వక్ బోర్డ్ సభ్యులు సంధాని బాషా మాట్లాడారు. కొన్ని మసీదుల్లో ఇమామ్‌లు, మౌజన్లక గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు రఫీ ,యువ నాయకులు రహీం,బాబు, రియాజ్ ,మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందనలు

-వెంకటాచలం : విఎస్‌యు విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు విసి సుందరవల్లి అభినందనలు తెలిపారు.కర్ణాటకలోని శివమొగ్గలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరానికి ఎపికి చెందిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి ఎంపికైన వలంటీర్లు వారి ప్రదర్శనలు అక్కడ కనపరిచి నూతన సందర్శన ప్రణాళిక, సామాజిక సేవా కార్యక్రమాలు వివిధ అనుభవాలు వివిధ రకాల కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచారు...వారిని విసి అభినందించారు.

సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు :విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి, తమ కొర్కెలను తీర్చుకొనేందుకు అవసరమైన నగదు కోసం సైబర్ నేరాలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్న ముఠా సభ్యులు 10 మందిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 12 సెల్‌ఫోన్లు, 2 ల్యాబ్‌ట్యాబ్‌లు, ఒక ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సైబర్ ముఠా అరెస్టుకు సంబంధించిన వివరాలు వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో 33 మంది డిబార్

ప్రజాశక్తి వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ పరీక్షలలో మొత్తం 33 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ, నాలుగో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 7681 మంది విద్యార్థులకు గాను 7156 మంది విద్యార్థులు హాజరయ్యారు.

'మేకపాటి'కే ఉదయగిరి..!

ఇన్‌ఛార్జ్‌గా నియామకం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి నియోజకవర్గానికి మేకపాటి కుటుంబానికే కేటాయిస్తూ, వైసిపి అధినేత నిర్ణయం తీసుకున్నారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశంతో మంగళవారం నియమించారు. అనేక రాజకీయ నాటకీయ పరిణామాల నేపథ్యంలో వైసిపి అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి పట్టుపట్టడంతో ఆయన చిన్న సోదరుడు మేకపాటి రాజారెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఈ విషయాన్ని 'ప్రజాశక్తి' నెలరోజుల క్రితమే ప్రచురించింది. ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైసిపికి గుడ్‌బాయ్ చెప్పారు. ఉదయగిరి టికెట్ కోసం మెట్టుకూరు ధనంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి టికెట్ కోసం క్యూ కట్టారు. 1983 నుంచి మేకపాటి కుటుంబం ఉదయగిరి నియోజవర్గం నుంచి పోటీ చేస్తుంది. తన సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ మారడంతో అది తనకుటుంబం పోటీలో ఉండాలని మేకపాటి రాజమోహన్‌రెడ్డి భావించారు. అందుకు తొలుత మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె రచనారెడ్డి, అటు తరువాత ఆమె భర్త ఆదాల వంశీకృష్ణారెడ్డి పేర్లు ముందుకొచ్చాయి. ఇద్దరిలో ఒకరికి అవకాశం ఇవ్వడానికి ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. వీరిద్దరు చివరి నిముషంలో వెనక్కి తగ్గారు. మళ్లీ తమకు ఇవ్వాలని ఆశావాహులు జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన చిన్న సోదరుడు మేకపాటి రాజారెడ్డిని రంగంలోకి దింపారు. బెంగుళూరులో వ్యాపారం చేసుకుంటున్న ఆయనను తీసుకొచ్చి సిఎంను కలిశారు.తన సోదరుడుకి ఉదయగిరి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలిసింది. అందరినేతలతో మాట్లాడి మేకపాటి రాజారెడ్డినే ఉదయగిరికి ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.ఆయనే ఉదయగిరి అభ్యర్థిగా తెలుస్తోంది. మేకపాటి కటుంబం తమ సత్తాచాటుకుంది.


ముఖ్యమంత్రిని కలిసిన మేకపాటి రాజారెడ్డి

అన్నదానం

పొదలకూరు : పట్టణంలోని మారుతీ నగర్‌లో ఉన్న వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి అనంతరం వారోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. కమ్మ జనసేన సేవా సంఘం వారు ఆయన సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. మండల టిడిపి అధ్యక్షులు టి. మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షులు బి. మల్లికార్జున నాయుడు, టిడిపి నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పెంచల స్వామి ఉన్నారు.

తల్లిదండ్రులకు సూచనలు

పొదలకూరు :స్థానిక డిఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సనత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలను సవివరముగా వివరించారు. ఎంఇఒ కె. మధుసూదన్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు, దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపా యాలు, విద్యాబోధన ఉందని ,అమ్మ ఒడిలాంటి కార్యక్రమాల వల్ల హాజరు శాతం కూడా పెరుగుతుందని తెలిపారు.

నూతన కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థలో పనిచేయుచున్న మంచినీటి సరఫరా విభాగంలోని ఫిట్టర్ కూలీలు,వాల్వ్ ఆపరేటర్స్,పంప్ ఆపరేటర్స్ మరియు వర్క్ ఇన్స్పెక్టర్లు తో గాంధీ బొమ్మ వద్దనున్న స్వతంత్ర పార్కులో జనరల్ బాడీ సమావేశం నిర్వహించుకొని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని వర్క్ ఇన్‌స్పెక్టర్ కమిటీ 15 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గౌతమ్ యాదవ్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శి వర్గ సభ్యులుగా కిరణ్,రియాజ్, అమర్,శివకుమార్, హసనుద్దీన్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌ఎం సునీల్ కుమార్, ఎం అశోక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ షబ్బీర్, వెంకటయ్య ఉన్నారు.

'ఆనం'కు టిడిపిలో ప్రాధాన్యత లేదు : నేదురుమల్లి

-రాపూరు : టిడిపిలో ఆనం రామనారాయణరెడ్డి పాత్ర శూన్యమని, ఆ పార్టీలో ఆయనకు ప్రాధాన్యత లేదని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ పేర్కొన్నారు. రాపూరు మండలం గోనుపల్లి సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారం అనంతరం మీడియాతో మాట్లాడారు. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డిని నెల్లూరు జిల్లాలో ఎక్కడ నుంచి పోటీ చేసినా ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. లోకేష్ యుగళం లో ఆయన పాత్ర ఆత్మకూరుకే పరిమితమైందన్నారు. సంస్కార హీనులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

మిద్దెపైన నుంచి జారిపడి వ్యక్తి మృతి

పొదలకూరు : పిట్టగోడ లేని మిద్దె పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మతి చెందిన ఘటన పట్టణంలోని ఎంఆర్ఒ కాలనీలో మంగళవారం జరిగింది. ఎంఆర్ఒ కాలనీకు చెందిన జ్యోతి సుబ్రహ్మణ్యం(28) గత శనివారం రాత్రి మద్యం మత్తులో మిద్దెపై నిద్రపోయాడు. ఈ తరుణంలో మిద్దె చుట్టూ పిట్ట గోడ లేకపోవడంతో నిద్రలో జారిపడ్డాడు. ప్రమాదంలో తల వెనుక భాగం బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం పొదలకూరు ఆసుపత్రికు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, తిరుపతి హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరిముల్లా పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేయండి

వలేటివారిపాలెం :జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్ సూచించారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒకార్యాలయంలోని సమావేశపు హాలు నందు మంగళవారం మధ్యాహ్నం ఎంపిపి పొనుగోటి మౌనిక అధ్యక్షతన జరిగింది. ఎంపిపితో పాటు జడ్పీటిసి ఇంటూరి భారతి మాట్లాడారు. సభ్యుల మాట్లాడారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

తోటపల్లిగూడూరు : ప్రజలకు వరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెచ్చిన సరి కొత్త జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎంపిపి ఉప్పల స్వర్ణలత పేర్కొన్నారు. ఎంపిడిఒ కన్నం హేమలత అధ్యక్షతన మంగళవారం మండలంలోని నరుకూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి పాల్గొన్నారు. ఎంపిపి స్వర్ణలత, ఎంపిడిఒ హేమలత మాట్లాడారు. వైసీపీ కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, విఆర్ఓ వరిగొండ సు రేంద్ర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉలవపాడు :చాకిచర్ల , పెద్దపట్టపుపాలెం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధనకోటి గారు ,యంఎల్ఒ శ్రీనివాస , చాకిచర్ల గ్రామ పార్టీ నాయకులు మధు రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఆవుల రామ్మూర్తి , హరిబాబు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఎస్‌పి

నెల్లూరు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ో ప్రస్తుతం జిల్లాలో చోటు చేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలలో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదు అవుతున్న ఎస్‌సి,ఎస్‌టి కేసుల దర్యాప్తులో ఎట్టి పరిస్థితుల్లో పోలీసులు అలసత్వం వహించరాదని సూచించారు. 174 క్రైం, పిసి కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఒ కు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, తదితర కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్షించారు.

హామీలు నెరవేర్చకపోతే సమ్మె..!

ప్రజాశక్తి -నెల్లూరు : ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు చేసిన హామీ నెరవేర్చకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) హెచ్చరిం చింది. మంగళవారం మున్సిపల్ కార్మికులందరికి ఉద్యోగభద్రత కల్పించాలని, పర్మినెంట్ చేసేంతవరకు పోరాటం తప్పదని, ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడాలని, కార్మికులకు వైసిపి ప్రభుత్వం నమ్మకద్రోహం చేయడం తగదంటూ గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని స్వతంత్ర పార్కు ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కొత్త డిమాండ్లు, గొంతెమ్మ కోర్కెలు తీర్చమని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. వైసిపి ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో అసెంబ్లీ సాక్షిగా చేసిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ మూలం ప్రసాద్,ఆర్ శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎం సునీల్,ఎం అశోక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ షబ్బీర్, వెంకటయ్య, లోకేష్, వాటర్ సప్లై వర్కర్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముని మోహన్ కుమార్, కష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గౌతమ్ యాదవ్,ఆనంద్, బాలు,రియాజ్,కిరణ్, శేషయ్య కార్పొరేషన్ మంచినీటి సరఫరా విభాగంలో పనిచేయుచున్న పంప్ ఆపరేటర్స్, వాల్వ్ ఆపరేటర్స్, ఫిట్టర్ కూలీలు ఉన్నారు.



రవిచంద్రకు 'ఇంటూరి' పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ శాసనమండలి సభ్యులు బీదా రవి చంద్రకు యువగళం పాదయాత్రలో కుడి కాలుకు గాయమై నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని విషయం తెలుసుకున్న కందు కూరు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం మంగళవారం పరామర్శించారు. గాయం నుండి త్వరగా కోలుకొని జనజీవన స్రవంతిలోకి రావాలని వారు ఆకాంక్షించారు. వారి వెంట నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కందుకూరు నియోజ కవర్గం మీడియా కోఆర్డినేటర్ దివి శ్రీధర్ ఉన్నారు.

బెల్ బహూకరణ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళవారం తల్లిదండ్రుల కమిటి సమావేశం చైర్మన్ పచ్చవ మహేష్ అధ్యక్షతన జరిగింది. ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం అనేక పథకాలు ఉచితంగానే అందిస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం కోట్లరూపాయిలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. అమ్మఒడి ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తున్నట్లు చెప్పారు. గోరుముద్ద, జెవికె కిట్లు, రాగిజావ, చిక్కీలు ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు రూ.7వేలు విలువ చేసే విద్యుత్ బెల్‌ను గ్రామ మాజీ సర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు ఉచితంగా అందజేశారు. దాత వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూనే ఉన్నారు. అత్తోట మాలకొండయ్య, పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

తోటపల్లిగూడూరు : ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలపై మండలంలోని చెన్నాపల్లెపాలెం హై స్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ప్రధా నోపాధ్యాయులు సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, ఇంగ్లీష్ మీడియం విద్య, మహిళా కళాశాల, నాడు నేడు, జగనన్న గోరుముద్ద, ఇంటరాక్టివ్ పానెల్ బోర్డు, ఆణిముత్యాలు, బాయిలింగ్వల్ టెక్స్ట్ బుక్స్, మొదలగు అంశాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బక్రీద్ పండుగకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముస్లిం సోదరుల పవిత్ర పండుగ బక్రీద్ పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, మైనారిటీ నాయకుడు షేక్ రహీంలు పేర్కొన్నారు. గురువారం జరగనున్న బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకునే ఈద్గా మైదానాన్ని వారు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, సుల్తాన్ షాహిద్ మసీదు మౌజన్లతో కలసి పరిశీలించారు. ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రార్థనలకు వచ్చే ముస్లీం సోదరులకు షామియానాలు, మంచినీటి వసతి, వజూ చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు తప్పక చేయాలని కోరారు. స్పందించిన వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు సిబ్బంది, వైసిపి, మైనారిటీ నాయకులున్నారు.

సిఐ గిరిబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి : అక్రమార్కుల ఆట కట్టించినందుకు సిఐ గిరిబాబును జిల్లా ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి ప్రశంసా పత్రంతో అభినందించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.గిరిబాబు బాధ్యతలు చేపట్టిన నుండి తమ సర్కిల్ పరిధిలోని కేసులే కాకుండా జిల్లాలో జరుగుతున్న ప్రధానమైన నేరాల పరిష్కారంలో చురుకుగా పాల్గొన్నందుకు జిల్లా ఎస్‌పి ఆయన్ను ప్రశంసా పత్రంతో అభినందించారు. ఇటీవల ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సర్వీస్ ఆన్‌లైన్ మోసాలు పాల్పడుతున్న పది మంది నిందితుల ను అరెస్ట్ చేసినందుకు సిఐను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.

కీళ్ల వైద్యశిబిరం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని ఆనంద్ హాస్పిటల్‌లో మంగళవారం డాక్టర్ ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎమ్.శశిధర్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకలు, కీళ్ల వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 100మంది రోగులను పరీక్షచేసి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ శిబిరంలో 45సంవత్సరాలు పైబడిన రోగులను పరీక్ష చేసి రూ.2500 విలువగల బి.ఎమ్.డి.స్కాన్ ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ సాధారణంగా 45 సంవత్సరాలు పైబడిన వారిలో నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పి, శరీరంలో అన్నిచోట్లా ఎముకలు నొప్పులుగా అనిపిస్తుంటాయి. ఆటువంటి వారిలో ఎముకలులో సాంద్రత, పటుత్వం కోల్పోతారన్నారు. ఆనంద్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మధ్యతరగతి వారికి అందుబాటులో తక్కువ ఖర్చుతో చేస్తామని, డాక్టర్ ఎమ్.శశిధర్ 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో ప్రజల వద్దకే పాలన

ప్రజాశక్తి-జలదంకి : రెవెన్యూ సదస్సులతో ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిందని కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు తెలిపారు. మంగళవారం తిమ్మసముద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యాలయంలో తహశీల్దారు సిహెచ్ పద్మావతి మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏ సమస్యలైనా సదస్సులలో అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఓ జి.శ్రావణి, విఆర్ఎలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి : సొంత నిధులతో ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి విద్యార్థులకు ఉపయోగపడే వస్తు సామాగ్రి పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లాయపల్లి ఎంపియుపిఎస్ ప్రధానోపాధ్యా యులు గాజులపల్లి సుబ్బారెడ్డి తన పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుకి ఒక నోట్బుక్ రెడ్ బ్లూ పెన్ పెన్సిల్ షాప్నర్ అరైసర్ కిట్లు అందజేశారు. విద్యార్థి తల్లి దండ్రులు గ్రామస్తులు అభినందించారు. సహోపాధ్యా యులు ఆదిలక్ష్మిదేవి, ప్రశాంతి కుమారి, పాఠశాల చైర్మన్ ఏసుదాసు, తదితరులున్నారు.

క్రీడాకారిడికి వీడ్కోలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బృందావన కాలనీకి చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు నాగరాజు సోమవారం ఉలవపాళ్ల జాతీయ రహదారి దగ్గర ప్రమాదవశాత్తు మరణించారు. మంగళవారం ఆయన పార్థవదేహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్ సురేష్ బాబు, బోగోలు టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, విశ్వనాథరావుపేట ఎంపిటిసి ఏకే సుందర్ రాజ్, అడ్వకేట్ విజయ్ కుమార్, బిజెపి పార్టీ నాయకులు అలెగ్జాండర్, బిట్రగుంట ఫుట్బాల్ క్రీడాకారులు, పలు చర్చిల పాస్టర్లు ఆయనకు ఘనంగా నివాళులర్పించి ఆయన అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మృతదేహాన్ని తాళ్లూరు రోడ్డులో ఉన్న క్రైస్తవ సోదరుల సమాధుల తోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం ముంగమూరు రోడ్డు జాతీయ రహదారి ప్రక్కన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథలకు అన్నం ప్యాకెట్లను, అరటిపండు, మామిడి పండ్లను సంఘ సేవకుడు వెంకటసుబ్బయ్య అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న బి మురళీకృష్ణ, చందన తనయుడు హరి హంత్ మహేష్ మూడవ సంవత్సరం పుట్టినరోజు సందర్భంగా మండలంలో ఉన్న ఆదరణ కేంద్రంలోని అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కట్టెపల్లి సింహాద్రి, భవాని, ఆదరణ కేంద్రంలోని సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని తూర్పు కాపు వీధిలో బండి లింగారెడ్డి అనే రైతుకు సంబంధించిన గడ్డివామి మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. చుట్టుపక్కల ప్రజలు ఎంత ఆర్పినా మంటలు ఆగకపోవడంతో అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. హుటాహుటిన కావలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రైతు గేదెల కోసం సుమారు 11 ఎకరాలలో గడ్డిని సేకరించి ఉంచగా కాలిపోయింది.

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పివి రమణయ్య ఎన్నిక

ప్రజాశక్తి-ఉదయగిరి : దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పివి రమణయ్య ఎన్నుకోవడంపై కమిటీ అధ్యక్షుడు సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ మీటింగ్ హాల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ దళిత బహుజన శ్రామిక యూనియన్ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరు జిల్లా జిల్లాకు చెందిన పీవీ రమణయ్య ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సి ఎస్టి 1989 చట్టం అమలులో యూనియన్ దీర్ఘకాక ప్రణాళిక ప్రకారం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు, ఐఎఎస్ అధికారి వరప్రసాద్, ఐపిఎస్ రిటైర్డ్ అధికారి అమర్నాథ్, దక్షిణాది రాష్ట్రాల ఎస్సి ఎస్టి అమలు చట్టాల అమలు పర్యవేక్షకులు ఎడ్విన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ, రాష్ట్ర అధ్యక్షులు శిరీష, సాక్షి హ్యూమన్ రైట్స్ నందగోపాల్, గుంటూరు జిల్లా డీబీఎస్ఈ ప్రతినిధి హేమలత పాల్గొన్నారు.

బోగస్ పట్టాలపై గప్‌చుప్..!

- స్పందించని రెవెన్యూ అధికారులు
- విరువూరులో అక్రమార్కుల ఆక్రమణ

ప్రజాశక్తి-వరుకుంటపాడు

కంచే చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల్లో కొంతమంది చేతివాటం ప్రదర్శించి రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేయడంలో తమవంతు పాత్ర పోషించిన విషయం వెలుగులోకి వచ్చింది. వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 5, 6, 7లలో ప్రభుత్వ నిబంధనలకు సంబంధం లేకుండా ప్రభుత్వ భూమిని 6 మంది పేర్లతో బోగస్ పట్టాలు సంపాదించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 2019 ఫిబ్రవరిలో ఈ బోగస్ పట్టాలు సృష్టించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అప్పటి రెవెన్యూ అధికారుల్లో కొందరు అధికారపార్టీ నేతలకు అండగా నిలిచి, వ్యక్తిగతంగా లబ్ధి పొంది ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారనే విమర్శలు వస్తున్నాయి. అసైన్మెంట్ కమిటీ ఆమోదం, లేకుండా, గ్రామసభలో ప్రవేశపెట్టకుండా పట్టాల పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూమి పట్టాలు ఇవ్వాలంటే ఆ గ్రామ రెవెన్యూ పరిధిలో నివాసి అయి ఉండాలి. అదే గ్రామంలో తెల్ల రేషన్ కార్డు ఉండాలి. గ్రామసభ నిర్వహించి ఎవరికి ఎలాంటి అభ్యంతరం



విరువూరులో పంపిణీ చేసిన రెవెన్యూ భూమి

లేకపోతే అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందితే అప్పుడు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పట్టాలు మంజూరు చేయాలి. పై భూముల వ్యవహారంలో ఎక్కడ ప్రభుత్వ నిబంధనలు పాటించినట్లు ఆధారాలు లేవు.

సర్వేనెంబర్ 61లో చిరోళ్ల వెంకట భాగ్యలక్ష్మి పేరుతో 4.90 ఎకరాలు 62లో4.75 ఎకరాలు ఆత్మకూరు రోశయ్య పేరుతో, 51 దుగ్గినేని రమణమ్మ పేరుతో 4.90 ఎకరాలు, సర్వే నెంబర్ 52లో కోటపాటి వెంకటేశ్వర్లు పేరుతో 4.80 ఎకరాలు, సర్వే నెంబర్ 71 బొండిగల విజయమ్మ పేరుతో 4.24 ఎకరాలు, సర్వే నెంబర్ 72లో పందిటి అచ్చమ్మ పేరుతో 4.92 ఎకరాలకు అప్పటి అధికారులు డీఫారం పట్టాలు ఇచ్చారని రికార్డులు చెబుతున్నాయి. ఈ విషయం కొంత కాలంలో బయటకొచ్చినా అధికారులు నోరు మెదపడం లేదు. కనీసం విచారణ చేపట్టకుండా తూ.తూ. మంత్రంగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విరువూరు గ్రామ 2012 తర్వాత అసైన్మెంట్ కమిటీ సమావేశం జరగలేదు. ఉదయగిరి నియోజకవర్గంలో అసైన్మెంట్ కమిటీ సమావేశం 2012లో చివరిసారిగా జరిగిందని గ్రామస్తులు తెలిపారు. 2019లో అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే భూ పంపిణీ ఎలా జరిగిందో పట్టాలు ఎలా ఇచ్చారో ఎవరికి అర్థం కాని పరిస్థితి అని వారన్నారు.

మా గ్రామాల వారికే కాకుండా మదిదెల మురళీకృష్ణ

గత ప్రభుత్వంలో కొందరు టిడిపి నాయకుల ప్రోద్భలంతో అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం జరిగింది. రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుంది. మా పంచాయతీ పరిధిలో 10 సెంట్లు లేని నిరుపేదలు ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారికి భూ పంపిణీ చేయకుండా నాయకుల మెప్పు కోసం బినామీ పేర్లతో ప్రభుత్వ భూమిని అప్పనంగా కొందరికి కేటాయించడంలో భారీగానే ముడుపులు చేతులు మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజమైన పేదలకు భూమి లేని వారికి భూ పంపిణీ చేస్తే ప్రజలు హర్షిస్తారు.

ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అనంతసాగరం

జూలై 10, 11 తేదీల్లో అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ కేంద్రంలో, మరిపాడు మండలం డిసిపల్లి అంగన్వాడీ సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు నాగమణి పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి జూలై 10, 11వ తేదీలలో జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు అంగన్వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి-కావలి : మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన "మాలల ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి కావలి నియోజకవర్గం నుండి 40 మంది టిడిపి మాల నాయకులు బయలుదేరి వెళ్లారు. వీరి వాహనానికి కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌సిసెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి నాగరాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, పార్టీ ముఖ్య నాయకులు గోల్ల శ్రీను, కమతం ప్రసాద్, దార్ల శివకుమార్, వసంతరావు, ఇనగంటి అనిల్, బాబు, మోడేగుంట శ్రీనివాసులు, బొల్ల వేణు, కోవూరు సునీల్, రాజశేఖర్, శ్రీహరి, కమతం శ్రీను, ముక్కు గోపాల్, మారుపూడి గోపి, మరి కొంతమంది పాల్గొన్నారు.

చింతలపాలెంలో 'సంజీవనీ ఆరోగ్య రథం'

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని చింతల పాలెం రామాలయం వద్ద కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంజీవని ఆరోగ్య రథం వైద్య శిబిరంలో 289 మంది వైద్య సేవలు పొందారు. 165 మందికి వివిధ సమస్యలపై వైద్య సేవలు అందించారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న 124 మందికి ప్రత్యేక వైద్య చికిత్స అందించి వారికి అద్దాలను కూడా పంపిణీ చేశారు. గట్టుపల్లి, చింతలపాలెం, రామవరప్పాడు తదితర గ్రామాల నుండి టిడిపి యువత ఆధ్వర్యంలో నిరుపేదలైన ఆరోగ్యం బాగున పడిన వారంతా వైద్యం చేయించుకున్నారు. కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ చేస్తున్న వైద్య సేవలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నా క్యాంటీన్, మందిరికి, మజ్జిగ చలివేంద్రాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కార్యక్రమంలో మెడికల్ ప్రజల మాజీ ఎంపిటిసి వల్లూరి వినోద్, కొల్లా రాధాకృష్ణ నాయుడు, గొట్టిపాటి మనోజ్, మార్కండేయులు, గంగినేని మాల్యాద్రినాయుడు, గొట్టిపాటి రాంబాబు, కాటుబోయిన రవికుమార్, నాసిన చెన్నకేశవులు, గంగినేని రవీంద్ర, కాసు చెంచు నాయుడు, గంట అశోక్, కంచర్ల రామచంద్ర నాయుడు, కిలారి క్రిష్టయ్య నాయుడు, తలుపోలి మధుసూదన్ రావు, పరిమి శ్రీహరి నాయుడు, ముచాలా మధుసూదన్ రెడ్డి, వెలమూరి ఉమామహేశ్వర రెడ్డి, తమ్మినేని మహేశ్వరరావు పాల్గొన్నారు.



రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు

గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రంలోని కోనేటిమిట్ట, రజక కాలనీ, బిసి కాలనీ అలాగే తదితర కాలనీలలో మంగళవారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడపగడప కార్యక్రమంలో పాల్గొని ఆయా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి జగన్మోహన్ రెడ్డి నిత్యం పేద ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. అందులో భాగంగా వివిధమైన సంక్షేమ పథకాలను ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అమ్మఒడి పథకం ద్వారా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారని పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు జగనన్న స్థలాలు మంజూరు చేసి సొంత ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. ప్రతినెల ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతిఒక్కరూ జగన్మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్, కోడూరు సాధక్‌కుమార్ రెడ్డి, దర్శిగుంట వెంకయ్య, దాసరి పోలయ్య, చంతాటి శ్రీనివాసులు తదితరులున్నారు.

'భవిష్యత్తుకు గ్యారంటీ - చైతన్య యాత్ర'

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర టిడిపి పిలుపునిచ్చిన "భవిష్యత్తుకు గ్యారంటీ-చైతన్యరథయాత్ర" కార్యక్రమాన్ని మంగళ వారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా నేతలందరూ హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి, రానున్న టిడిపి ప్రభుత్వంలో వాటిని పరిష్కరించేందుకే టిడిపి "భవిష్యత్తుకు గ్యారెంటీ- చైతన్య యాత్ర" కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. తొలుత ట్రంక్ రోడ్డులోని ఎన్.టి.ఆర్. విగ్రహం వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించి బయల్దేరారు. అనంతరం కలుగోళ శాంభవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడ నుండి పెద్ద పవనిరోడ్డు లోనిఓవర్ బ్రిడ్జి, పూర్తయినా, అప్రోచ్ రోడ్డు వేయించలేదని గుర్తించి, దానిని తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే తమ హయాంలో పూర్తి చేయిస్తామని తెలిపారు. కావలి పట్టణ మద్దూరుపాడు 1వ వార్డులో గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించబడిన టిడ్కో గృహాలను ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వ పైశాచికత్వానికి నిదర్శనంగా మారిన టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. కావలి రూరల్ మండలంలోని రుద్రకోట వద్ద జరుగుతున్న గ్రావెల్



మాఫియాపై సెల్ఫీ చాలెంజ్ విసిరి, ధ్వజమెత్తారు. కార్యక్రమంలో భాగంగా కావలి రూరల్ మండలం, అన్నగారిపాలెం పంచాయతీ, పూలదరువు గ్రామంలోకి చేరుకున్న సందర్భంగా స్థానికులు టిడిపి నేతలకు నీరాజనాలు పలికారు. పూలదరువు సెంటర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ సందర్భంగా ఘనమైన నివాళులర్పించారు. కార్యక్రమానికి మాజీ ఎం.ఎల్.ఎ. కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్.పి. చైర్మన్ చెంచలబాబు యాదవ్, జెన్నీ రమణయ్య, బొమ్మిసురేంద్ర హాజరయ్యారు. టిడిపి నేతలు డాక్టర్ ఏగూరి చంద్రశేఖర్, గుత్తికొండ కిషోర్ బాబు, మొగిలి కల్లయ్య, జి.శ్రీదేవి చౌదరి, పోతుగంటి అలేఖ్య, చల్లంచర్ల రాజా, ద్రోణాదుల వాసంతి, చిట్టాబత్తిన మాల్యాద్రి, మాలేపాటి నాగేశ్వరరావు, లేళ్లపల్లి సుధీర్, బొట్లగుంట శ్రీహరి నాయుడు, పల్లపు మోహన్, కమ్మిశెట్టి రమణయ్య, దామా మాల్యాద్రి నాయుడు, అమరజ్యోతి, షేక్.మస్తాన్, పైడి హర్ష, కావేటి కోటయ్య, షేక్.రఫీ పాల్గొన్నారు.

మేకపాటి రాజారెడ్డి నియామకంపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి



మేకపాటి రాజారెడ్డికి ఉదయగిరి ఇన్చార్జి బాధ్యతలు ప్రకటించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కో ఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, శకునాల పల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, ఉదయగిరి ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతయ్య మాట్లాడుతూ ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించడంపై నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయన్నారు. మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో తిరుగులేని ఘనవిజయాన్ని వైసిపి పార్టీ తరపున మేకపాటి కుటుంబ సభ్యులైన మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఘన విజయాన్ని సాధిస్తారని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రెండోసారి చరిత్రలో నిలిచేలా రెండో ముఖ్యమంత్రిగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని కొత్తవంగల్లు హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన ఆ పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం రాగిపాటి శ్రీహరి రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని వితరణగా ఇచ్చారు. వీటిని గ్రామానికి చెందిన వైసిపి నేత చక్కా మనోహర్ బాబు, ఎంపీటీసీ సభ్యులు నంబూరి ప్రసాద్ మంగళవారం విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఇక్కడి పాఠశాలలో హెచ్ఎంగా పని చేసి బదిలీపై వెళ్లిన అక్కిరెడ్డి. ఉపాధ్యాయులు సురేష్, భూపతి, భవానీలను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంకుమార్, వైసిపి నేతలు మాలకొండయ్య, రఘురామయ్య, మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-కొడవలూరు

బుచ్చిరెడ్డిపాలెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మండలంలోని రామాపురంలో ఎంపిపిఎస్‌యుపి పాఠశాల, ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు షేక్ ఎజ్దానీ బాషా మాట్లాడుతూ దాత తాళ్ల స్వామికి సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. హెచ్ఎం అనసూయమ్మ, సొసైటీ సభ్యులు పటాన్ రహమతుల్లా, షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్ : విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్ ప్రాంగణంలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు 75శాతం హాజరైతేనే అమ్మఒడి తల్లులు ఖాతాలో పడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూధన శాస్త్రి, ప్రసాద్ ప్రసాద్, తిరుపతయ్య, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశం పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్.ఘనీబాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకోవాలని, విద్యార్థులను పాఠశాల నుంచి ఇంటికివచ్చిన తర్వాత వారి చదువుపై కూడా శ్రద్ధ వహించాలని తల్లితండ్రులను కోరారు. వైస్ చైర్మన్ సయ్యద్.ఘనీబాషా మాట్లాడుతూ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చొరవతో మనపాఠశాలకు సుమారు రూ.2కోట్లు విలువ చేసే నాడు-నేడు పథకం ద్వారా శాంక్షన్ చేయించి నందుకు ఎం.ఎల్.ఎ. కృషిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సయ్యద్.హయ్యుల్ హయ్యూమ్, సచివాలయ సిబ్బంది గిరీష్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, ప్రసన్నకుమార్, కమలకుమారి, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక జెడ్‌పి పాఠశాలలో పేరెంట్స్ సమావేశం మంగళవారం ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సమావేశానికి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ సుభాషిని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మర్రిపాడు : పిల్లలు ఉన్నత స్థాయి చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని, వారు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మలత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ఆమె సమావేశమయ్యారు. విద్యార్థులు సరైన మార్గంలో నడవాలంటే తల్లిదండ్రులు మొదటి గురువు గురువు ఉపాధ్యాయులన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యాబోధన చేస్తున్నారా.. లేదా పిల్లలు బాగా చదువుతున్నారా.. అనే విషయాలు తెలుసుకోవాలంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిర్వహించే సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. పిల్లలకు మంచి విద్య అందించేందుకు తమవంతు కృషి చేస్తామని, పిల్లలు బడికి పంపించే ప్రయత్నం తల్లిదండ్రులు చేయాలన్నారు. విజ్ఞానాన్ని అందించి బంగారు భవిష్యత్తుకు దారి చూపే పాఠశాలల్లో అందరి భాగస్వామ్యం ఉంటే ఆ పాఠశాల అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. విద్యార్థులను ప్రార్థనా సమయానికి ముందే బడిలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని అందిపుచ్చుకొని చదువుల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ దుంపలగడ్డ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రసాద్, నాగరాజు, చిన్నపరెడ్డి, కృష్ణమోహన్, వెంకటసుబ్బారెడ్డి, పిడి హరినాథ్, ఉపాధ్యాయు నీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : డ్రాపౌట్స్(బడి బయట పిల్లల)పై సమగ్ర శిక్ష అధికారులు ప్రత్యేక దష్టిసారించారు. మండలంలోని గుండాలమ్మపాలెం మజరా నీలగిరి సంఘం గిరిజన కాలనీలో డ్రాపౌట్స్ విద్యార్థులున్నారన్న సమాచారం పై సమగ్ర శిక్ష ఎఎంఒ జి.సుధీర్‌బాబు, సిఎంఒ కె.పెంచలయ్యలు మంగళవారం కాలనీని సందర్శించారు. ఇక్కడ వివిధ తరగతుల వయస్సు కలిగిన ఏడుగురు విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నట్లు గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్చడం వల్ల ప్రభుత్వమే అన్నీ సమకూర్చడంతోపాటు అమ్మ ఒడి నగదు మంజూరు చేస్తుందన్నారు. సమగ్ర శిక్ష అధికారులు ప్రభుత్వం ద్వారా పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ఆటో సదుపాయం కల్పించేందుకు అంగీకరించారు. దీంతో బుధవారం నుంచి ఆ ఏడుగురు పిల్లలను కొడవలూరు హైస్కూల్ పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. తొలుత కొడవలూరు హైస్కూల్లో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి వారు హాజరై పలు సూచనలు చేయడంతో పాటు మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. తహశీల్దార్ రమాదేవి, ఎంఇఒ జి.వసంతకుమారి, ఎంఇఒ అంకయ్య, హెచ్ఎంపి మంజువాణి, సిఆర్‌పిలు ఎం.దయాకర్, జి.పెంచలయ్య, టి. వెంకటసురేష్‌లున్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు వంటి పలు ప్రభుత్వ పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సమావేశానికి అనూహ్యంగా 100మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలుచోట్ల "జగనన్న సురక్ష"

ప్రజాశక్తి-కావలి

కావలి 1వ వార్డ్ మద్దురుపాడులో "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని మంగళవారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 1వ వార్డ్ మద్దురుపాడు కాలనీలో కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పొనుగోటి అనురాధ, 1వ వార్డ్ కౌన్సిలర్ వేణు, స్కైలాబ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని మహ్మదాపురంలో మంగళవారం జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్, ఎంపిడిఒ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపిడిఒ విజయభాస్కర్ రావు, ఎంఇఒ సాహువుద్దీన్, ఎపిఎం వైనారూత్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ఉప్పలపాడు, మంచాలపల్లి మంగళవారం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష పథకం సర్వేను మోడల్ ఆఫీసర్ ఎఒ శ్రీధర్ రెడ్డి, ఎంఇఒ బాలకృష్ణారెడ్డి, ఎంఇఒ-2 ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. సర్వేపై ప్రజలకు అర్థమయ్యేలా వలంటీర్లు వివరించాలని ఆయన సూచించారు. నెలాఖరులోగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూరు శాతం అందేలా చూడాలన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించి వారి సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు చొరవ చూపాలని ఆత్మకూరు మున్సిపల్ జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని 7, 8, 9 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్షా కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి వలంటీర్లకు డాక్టర్ ఆదిశేషయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, నౌషాద్ బేగం, మైనార్టీ నాయకులు జమీర్ భాషా, సచివాలయం అడ్మిన్ సురేంద్ర, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని బోయల చిరివెళ్ల గ్రామం సచివాలయ పరిధిలో గ్రామ వలంటీర్లతో జగనన్న సురక్ష కుటుంబాల సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఎంపిడిఒ పి.ఐజాక్‌ప్రవీణ్ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ 100 శాతం సర్వే పూర్తి చేయాలని వలంటీర్లుకు సూచనలు జారీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమము సంబంధించి ప్రభుత్వము వారు అందజేసే ఉచిత సేవలు ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, సర్పంచ్ బొలిగెర్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి అంకయ్య తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : నేలటూరులో చేపడుతున్న జగనన్న సురక్ష సర్వే జిల్లా డ్వామా పిడి వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని నేలటూరులో చేపడుతున్న సర్వేలో ఆయన పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వే జూలై 1 నుంచి 27 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు, ఇఒపిఆర్‌డి కే.మల్లికార్జున, ఎపిఒ శ్రీనివాసులు, ఉపాధి సిబ్బంది ప్రసన్న, తదితరులున్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : నగరంలో సచివాలయం -5పరిధిలో 13 వార్డులో శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో వలీంటర్లు, గృహ కన్వీనర్‌లతో కలిసి ఇంటింట జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన క్యాంపస్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ లో ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిలర్ లక్ష్మీ కాంతమ్మ, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, 13వ వార్డు కన్వీనర్ పి.రాజ్ కుమార్, ఐదవ సచివాలయం వాలంటీర్స్, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : పేదల ముఖంలో చిరునవ్వే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. కొడవలూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, డీటీ గున్నం మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, జి.జాలయ్య, విఆర్ఓ రఘురామ్, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 808 / 2019

M/s. Corporation Bank, Nellore Branch, Rep.by its Chief Manager - Plaintiff

Vs

1. **Pollepalli Dhana Sekhar**
2. **A. Madhusudhan** - Defendants

Notice

To,
D1. **Pollepalli Dhana Sekhar,** S/o **P. Narasimhulu,** Residing at Record Clerk, SR No. 610531, LIC of India, Divisional Office, Nellore City, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే28-07-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., LL.M., Ph.D.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Principal Junior Civil Judge, Gudur
I.A.No. 220 / 2022
O.S.No. 220 / 2020

1. **Puvvada Venkata Sudhakar** (Died)
2. **Puvvada Lakshmi Rajyam**
3. **Puvvada Venkata Sai Poojitha**
4. **Puvvada Venkata Sai Jaswanth**
5. **Puvvada Venkata Seshamma**

- Petitioners / Proposed Legal Representatives of the Plaintiff

Vs

Sesham Niranjan - Respondent /Defendant

Notice

To,
Sesham Niranjan,
S/o **Venkata Krishnaiah,**
B-Block, First Floor, Flat No-D, Sri Nivas Apartment, Iskcon City, Kondayapalem Area, Nellore City, SPSR Nellore (Dist).

పై దావాలో వాది అయిన **P. Venkata Sudhakar** చనిపోయినందున ఆయన వారసులుగా పిటిషనర్లు **2 to 5** ని **(L.R.S)** గా చేర్చమని పై కోర్టులో పిటిషను పెట్టి ఉన్నందున మీకు నోటీసు నిమిత్తం **తే 12-07-2023 దీకి** వాయిదా వేసియున్నారు. ఆరోజు మీరు గానీ, మీ తరపున లాయర్ గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్. చంద్రమోహన్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్లు తరపు వకీలు, గూడూరు.

In the Court of the Principal Junior Civil Judge, Gudur
I.A.No. 221 / 2022
I.A.No. 490 / 2020
O.S.No. 220 / 2020

1. **Puvvada Venkata Sudhakar** (Died)
2. **Puvvada Lakshmi Rajyam**
3. **Puvvada Venkata Sai Poojitha**
4. **Puvvada Venkata Sai Jaswanth**
5. **Puvvada Venkata Seshamma**

- Petitioners / Proposed Legal Representatives of the Petitioner

Vs

Sesham Niranjan
- Respondent / Respondent / Defendant

Notice

To,
Sesham Niranjan,
S/o **Venkata Krishnaiah,**
B-Block, First Floor, Flat No-D, Sri Nivas Apartment, Iskcon City, Kondayapalem Area, Nellore City, SPSR Nellore (Dist).

పై నంబరు పిటిషనులో పిటిషనరు అయిన **P. Venkata Sudhakar** చనిపోయినందున ఆయన వారసులుగా పిటిషనర్లు **2 to 5** ని **(L.R.S)** గా చేర్చమని పై కోర్టులో పిటిషను పెట్టి ఉన్నందున మీకు నోటీసు నిమిత్తం **తేది: 12-07-2023 కి** వాయిదా వేసియున్నారు. ఆరోజు మీరు గానీ, మీ తరపున లాయర్ గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్. చంద్రమోహన్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్లు తరపు వకీలు, గూడూరు.